APTEL/25/A3079

# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 12 నవంబర్ – 2025 పేజీలు: 24




# ఎడ్యుషైన్ మెంటార్స్

న్యూ ట్రెండ్ సెట్ చేసిన

**ఏపీ టీచర్స్**

# బ్యాండ్ బాజా మోగింది

## రాష్ట్ర స్థాయి పాఠశాల బ్యాండ్ పోటీలు నిర్వహణ

విజయవాడలో పటమట కేబీసీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి స్కూల్ బ్యాండ్ పోటీలు జరిగాయి. వివిధ జిల్లాల నుండి వచ్చిన బాలురు, బాలికల విభాగాల్లో క్రీడాకారులు బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ పోటీలలో బ్యాండ్ బాజా మోగించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS. గారు, ఏఎస్పీడీలు డా. ఎం.ఆర్. ప్రసన్నకుమార్ గారు, కె.రవీంద్రనాథ్ రెడ్డి గారు, కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డి గారు, స్టేట్ స్కూల్ బ్యాండ్ కాంపిటీషన్ నోడల్ ఆఫీసర్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ స్టేట్ సెక్రెటరీ జి.భానుమూర్తి రాజు గారు, సమగ్ర శిక్ష ఏడీ మనోహర్ నాయక్ గారు, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.










**విజేతలు:**

- మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్ కర్నూలు (బ్రాస్ బ్యాండ్ బాయ్స్)
- డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులం, జంగారెడ్డి గూడెం (పైప్ బ్యాండ్ బాలికలు)
- పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, మల్కాపురం, విశాఖపట్నం (బ్రాస్ బ్యాండ్ బాలికలు)
- ప్రథమ స్థానం సాధించిన విజేతలు 11 రాష్ట్రాలతో జరిగే జోనల్ స్థాయి పోటీలో పాల్గొంటారు.

# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 12 నవంబర్ – 2025 పేజీలు: 24





**గౌరవ సలహాదారులు**

**కోన శశిధర్,** ఐ.ఏ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ

**విజయరామరాజు.వి,** ఐ.ఏ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ

**పి.రంజిత్ బాషా,** ఐ.ఏ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య

**ఎడిటర్**

**బి.శ్రీనివాసరావు,** ఐ.ఏ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా

**సలహాసభ్యులు**

**వి.ఎన్.మస్తానయ్య**, డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, PRO

**వర్కింగ్ ఎడిటర్**

**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్

**చీఫ్ సబ్ ఎడిటర్**

**గణపతి రావు బెహరా,** PRO

**ఎడిటోరియల్ కమిటీ**

**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)

**డిజైనింగ్**

**గిరిధర్ అరసవల్లి**

**చిత్రకారులు**

**మల్లిక్**


## ఎడ్యుటైన్ మెంట్ ట్రెండ్ సెట్టర్స్

తరగతి గది నుంచి, ఆటస్థలం వరకూ.. బ్లాక్ బోర్డ్ నుంచి బడి తోటలో మొలిచిన మొక్కల వరకు ప్రతి వేదిక బోధనకు ఉపయోగించుకుంటున్న నవతరం ఉపాధ్యాయుల విజయ గాథలు స్ఫూర్తినిస్తున్నాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గొప్పతనాన్ని చాటి చెబుతున్నాయి.

21వ శతాబ్దపు నైపుణ్యాలు విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఉపాధ్యాయుల సృజనాత్మక విద్యా బోధన చోదక శక్తిగా మారుతోంది.

"It is the supreme art of the teacher to awaken joy in creative expression and knowledge." – Albert Einstein

చెప్పినట్టు సరదా, సందడి వాతావరణం సృష్టించి..పిల్లల్లో సృజనాత్మక వ్యక్తీకరణలను, జ్ఞానాన్ని పెంపొందించే అత్యున్నత కళను ఆచరిస్తున్న ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు.

సుశిక్షితులైన, ప్రతిభావంతులైన లక్షలాదిమంది ఉపాధ్యాయులు ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రూపొందించేందుకు కృషి చేస్తున్నారు. వీరికి ఆటపాటలలో మమేకం చేస్తూ విద్యార్థులను చదువుల బాట పట్టించే సరికొత్త బోధనా పద్ధతులు అవలంబిస్తున్న ఉపాధ్యాయులు దిక్సూచిగా నిలుస్తున్నారు.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/ samagrashiksha/ మరియు cse.ap.gov.in

# నవభారత నిర్మాణానికి పీఎంశ్రీ పాఠశాలలు









* పీఎంశ్రీ పథకంతో ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విప్లవం
* దేశవ్యాప్తంగా ఆదర్శ పాఠశాలలుగా పీఎం శ్రీ పాఠశాలలు
* అత్యధిక పీఎంశ్రీ పాఠశాలలు గల రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ కు రెండో స్థానం
* దక్షిణాదిలో అత్యధికంగా 935 పాఠశాలలతో ఎంపికైన ఆంధ్రప్రదేశ్
* విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ చొరవతో పీఎంశ్రీ కింద అదనంగా 80 పాఠశాలలు ఎంపిక

దేశంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడానికి, వాటిని జాతీయ విద్యా విధానం (NEP) 2020కి అనుగుణంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం. దేశవ్యాప్తంగా 14,500కి పైగా పాఠశాలలను మోడల్ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దే లక్ష్యంగా 2022 సెప్టెంబర్ 7న ఈ పథకాన్ని భారత ప్రభుత్వం ప్రారంభించి, విద్యారంగంలో నవ శకానికి నాంది పలికింది ఈ పథకం 2022-23 నుండి 2026-27 వరకు ఐదేళ్ల వరకు కొనసాగుతుంది. ఈ పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది.

## పీఎం శ్రీ పాఠశాలల లక్ష్యం

* మోడల్ పాఠశాలల ఏర్పాటు: దేశవ్యాప్తంగా దాదాపు 14,500 కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, వాటిని ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి చేయడం.
* నాణ్యమైన విద్య: విద్యార్థులకు ఉన్నత స్థాయి, నాణ్యమైన విద్యను అందించడం.
* విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పడటం, కేవలం విద్యాపరంగానే కాకుండా, వారిలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను (21st-century skills) పెంపొందించడం.
* ఆధునిక బోధన పద్ధతులు: ప్రయోగాత్మక, అన్వేషణాత్మక, డిజిటల్ బోధన పద్ధతులను ప్రోత్సహించడం.
* పర్యావరణ అనుకూలత: ఈ పాఠశాలలను "గ్రీన్ స్కూల్స్"గా అభివృద్ధి చేయడం, సౌరశక్తి, నీటి సంరక్షణ, మరియు వ్యర్థాల నిర్వహణ వంటి పర్యావరణ అనుకూల చర్యలను ప్రోత్సహించడం వంటి ఉన్నత లక్ష్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.
* నాయకత్వ లక్షణాలు: ఈ పాఠశాలలు తమ పరిధిలో ఇతర పాఠశాలలకు మార్గదర్శకత్వం వహించేలా తీర్చిదిద్దడం.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యం

దేశ వ్యాప్తంగా దాదాపు 14,500 పాఠశాలలు ఎంపిక చేయగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి 1,725 పాఠశాలలతో మొదటి స్థానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 935 పీఎంశ్రీ పాఠశాలలు కేటాయించి రెండో స్థానం కల్పించారు. సౌత్ ఇండియాలో అత్యధిక పీఎంశ్రీ పాఠశాలలు పొందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది.

## మంత్రి లోకేష్ చొరవతో పీఎంశ్రీ కింద అదనంగా 80 పాఠశాలలు ఎంపిక

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (PMSHIRI) పథక కింద రాష్ట్రంలో ఈ ఏడాదికి మొత్తం 80 పాఠశాలలను కేంద్రం ఎంపిక చేసింది. వీటికి రూ. 87 కోట్లు సరాసరి ఆమోదం పొందింది. అధికారిక నివేదిక రావాల్సి ఉంది. రాష్ట్రంలో మొదటి దశలో 662 పీఎంశ్రీ పాఠశాలలు, రెండో దశలో 193 కలిపి మొత్తం 855 పాఠశాలలను పీఎంశ్రీ కింద ఎంపిక చేయగా.. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ విద్యా సంవత్సరం అదనంగా మరో 80 పీఎంశ్రీ పాఠశాలలను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా 14,500 పీఎంశ్రీ పాఠశాలలు ఉండగా.. దక్షిణాదిలో అత్యధికంగా ఏపీకే 935 పీఎంశ్రీ పాఠశాలలను కేటాయించింది కేంద్రం. మొత్తం మీద మంత్రి నారా లోకేష్ కృషి కారణంగా పీఎంశ్రీ కింద రాష్ట్రానికి అదనంగా 2025-26 విద్యా సంవత్సరానికి మొత్తం రూ. 494 కోట్లు (రూ. 407 + రూ.87 కోట్లు) నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.





## ఆంధ్రప్రదేశ్‌లో అమలు తీరు: దేశంలోనే అగ్రస్థానం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీఎంశ్రీ పథకం అమలులో ఎంతో నిబద్ధతతో ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు, రాష్ట్రంలో మొత్తం 935 పాఠశాలలు ఈ పథకం కింద ఆమోదం పొందాయి. వీటిలో ప్రైమరీ, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుని, జాతీయ విద్యా విధానం (NEP) 2020ని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి అంగీకరించింది.

## నాణ్యమైన విద్య అమలు దిశగా కృషి.. PM SHRI ఆరు స్తంభాలు

1. NEP 2020కి అనుగుణంగా అనుభవాత్మక, నైపుణ్య ఆధారిత, వినూత్నమైన అభ్యాసంపై దృష్టి.
2. ఆదర్శ పాఠశాలలను స్మార్ట్ క్లాస్ రూమ్స్, సైన్స్ ల్యాబ్స్, సోలార్ పవర్, BaLA డిజైన్లు, సమగ్ర ఆటస్థలాలతో అప్‌గ్రేడ్ చేయడం.
3. ఉపాధ్యాయులు , పాఠశాల ప్రధానోపాధ్యాయుల స్కూల్ లీడర్షిప్ వంటి శిక్షణల ద్వారా సామర్థ్యాలను పెంచడం.
4. ప్రతి విద్యార్థికి సురక్షిత, సమగ్ర, సమానమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడం.
5. డేటా ఆధారిత బాధ్యతాయుత విధానం, అధికారుల భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకోవడం.
6. విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం నుండి నిరంతర అభిప్రాయం సేకరించి నాణ్యతా మెరుగుదల సాధించడం.

## మౌలిక సదుపాయాలు – వినూత్న కార్యక్రమాలు

* పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కొత్త బోధన పద్ధతులు, డిజిటల్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.
* పథకం అమలును పర్యవేక్షించడానికి, పురోగతిని సమీక్షించడానికి రాష్ట్ర విద్యా శాఖ నిరంతరం కృషి చేస్తోంది.
* రసాయన శాస్త్ర ల్యాబ్‌లు, బయాలజీ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాల ఏర్పాటు.
* 755 పాఠశాలల్లో ఆట స్థలాలను అభివృద్ధి చేశారు.
* 855 పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు & స్పోర్ట్స్ కిట్లు స్కూళ్లకు ఇచ్చారు.
* 794 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్ పరికరాలు అందజేశారు.
* 794 పాఠశాలల్లో వృత్తి విద్యను (10 ట్రేడ్స్‌లో) ప్రవేశపెట్టారు. 1.8 లక్షలకు పైగా విద్యార్థులు ఈ శిక్షణ పొందుతున్నారు. వృత్తి విద్య కోసం 4 ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రాంతీయ స్థాయిలో నాణ్యమైన శిక్షణ, ఆవిష్కరణను అందిస్తారు.
* ర్యాంపులు (401), మరుగుదొడ్లు (73) నిర్మాణం.
* 529 పాఠశాలల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, 532 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్
* స్కూల్ క్వాలిటీ అసెస్మెంట్ ఫ్రేమ్వర్క్ (SQAF) 855 పాఠశాలల్లో అమలు.
* 794 పాఠశాలల్లో స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్.
* భారత్ స్కౌట్స్ & గైడ్స్ ప్రోగ్రామ్ 820 పాఠశాలల్లో విజయవంతంగా అమలు.
* 20,725 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ల ద్వారా పరిశ్రమ అనుభవం పొందారు.
* ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నాయకత్వం, పాఠ్య ప్రణాళిక, బోధనా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.



## నిధుల వినియోగంపై పర్యవేక్షణ

పీఎం శ్రీ పథకంలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. మొబైల్ యాప్ ద్వారా నిధుల వినియోగం, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తారు. ప్రతి పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ. 50,000 నుండి రూ. 1.50 లక్షల వరకు వార్షిక గ్రాంట్లు అందిస్తారు. ఇంజినీర్లు, ప్రధానోపాధ్యాయులు నిర్మాణ పనుల పురోగతిని యాప్ ద్వారా నివేదిస్తారు, తద్వారా నిధులు దుర్వినియోగం కాకుండా 100 శాతం సమర్థవంతంగా వినియోగాన్ని పర్యవేక్షిస్తున్నారు.

## విద్యా వ్యవస్థకు పీఎంశ్రీ పాఠశాలలు ఒక కొత్త దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్ పీఎంశ్రీ పాఠశాలల్లో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (PAL) ల్యాబ్‌లు, ఆటిజం సెంటర్లు, స్కూల్ బ్యాండ్‌లు, 'నో బ్యాగ్ డే', భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, జాతీయ దినోత్సవ వేడుకలు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తాము. ఈ వినూత్న, సృజనాత్మక కార్యక్రమాలతో పీఎం శ్రీ పాఠశాలలు విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయడమే కాకుండా, దేశంలోని విద్యా వ్యవస్థకు ఒక కొత్త దిశానిర్దేశం చేస్తాయి.

– వి.ఎన్.మస్తానయ్య,
సీమ్యాట్ డైరెక్టర్








# పాఠశాల గ్రంథాలయం... పిల్లలకు అద్భుతమైన వరం

– మంచికంటి వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు

*గ్రంథాలయం మరో లోకాన్ని పిల్లల కన్నుల ముందుకు తెచ్చి నిలుపుతుంది.*
*గ్రంథాలయం పిల్లల ఆనందాలకు నెలవవుతుంది.*
*విజ్ఞాన దాహానికి నీటి చలమవుతుంది.*
*అంతులేని జ్ఞాన దాహార్తిని తీరుస్తుంది.*

పిల్లలను రాయండి అంటే ఎంతసేపైనా విసుగు విరామం లేకుండా రాస్తారు. చదవండి అంటే స్పందించరు. క్లాస్ పుస్తకాలు చదవమంటే చాలా ఇబ్బందిగా ఫీల్ అవుతారు. కథల పుస్తకాలు వాళ్ల ముందు పెడితే సంతోషంతో ఎగిరి గంతేస్తారు.అద్భుతమైన మరో లోకంలోకి వెళ్ళిపోతారు. పుస్తకాల గొప్పతనమది. ముఖ్యంగా కథల పుస్తకాలతో మొదలవుతుంది వాళ్ల గ్రంథాలయ పుస్తకాల అధ్యయనం. వాళ్ల విద్యార్థి జీవితమంతా అలాగే కొనసాగితే వాళ్ల నుండి తప్పకుండా గొప్ప గొప్ప వ్యక్తులు ఉద్భవిస్తారు.

ఒకటవ తరగతి పిల్లలు కూడా కథల పుస్తకాలు చదువుతారు. పుస్తకాల్లో ఉండే బొమ్మలను చూసి వాళ్ళు ఎంత గొప్పగా కథలు చెబుతారో వినాల్సిందే.

నిజంగా ఉపాధ్యాయుడిని కావడం నేను పొందిన గొప్ప వరం. సాయంత్రం నాలుగు గంటల తర్వాత పిల్లలు పుస్తకాలు చదువుతా ఉంటే ఎన్ని గంటలైనా సరే పాఠశాల నుంచి రావాలనిపించదు. ఒక్కొక్కరుగా తల్లిదండ్రులు చీకటి పడిందని పిల్లల కోసం వస్తారు. అప్పుడు తప్పనిసరి కావడం వల్ల పిల్లల్ని పంపిస్తాను.

గ్రంథాలయాన్ని అనుసరించడం వలనే నేను నిజమైన ఉపాధ్యాయుడిగా పరిణతి చెందుతూ వచ్చాను. పిల్లలను వారిలోని అద్భుతమైన శక్తులను గుర్తించే ఉపాధ్యాయుడిగా ఉన్నాను అంటే, ఏ పాఠశాలకు వెళ్లినా గ్రంథాలయాన్ని నెత్తికెత్తుకొని కనిపించిన ప్రతి పుస్తకాన్ని కొని పిల్లలకు ఇచ్చి చదివించడం, వాళ్ళు పొందే ఆనందాన్ని చూడడం కంటే నిజమైన గురువుగా సార్థకత ఏముంది. మహాప్రస్థానాన్ని కంఠతా పట్టేవాళ్ళు పిల్లలు.ఒక్కో కవితను కంఠతా చెప్పేవాళ్ళు. ఎంతోమంది కవుల కవితలు చదివి పిల్లలు ఎంత ఆనందం పొందేవాళ్ళో.

పిల్లలు కథల పుస్తకాలు ఇష్టంగా చదువుతారు కాబట్టి ఒక సంవత్సరానికి ఎన్నో పుస్తకాలు చదవగలుగుతారు. అంటే పిల్లలు తరగతి గది అందించే జ్ఞానం కంటే ఎన్నో రెట్లు జ్ఞానం గ్రంథాలయ పుస్తకాల ద్వారా సంపాదిస్తారు.అలా పుస్తకాలు చదివే విషయంలో పిల్లల్లో తెలియకుండా ఎంతో పోటీ ఉంటుంది. పోటీ పడి చదవడం వల్ల పిల్లలు సృజనాత్మక రచనలు కూడా చేయగలుగుతారు.

బాగా పుస్తకాలు చదివే పిల్లలు బాగా రాయ గలుగుతారు. పిల్లలు రచనల విషయంలో కూడా పోటీ పడతారు.

అలా పోటీ పడిన వారిలో వేదన కవితలు కథలు పుస్తకం రాసి మొదటిసారిగా పాఠశాలలో పుస్తక రచయితగా ముద్ర వేసుకుంది చింతగుంట్ల గీతిక. పుస్తకాలు చదవడంలో ఈ అమ్మాయి ఎంత పరిణతి సాధించింది అంటే నా కథలపై కూడా విశ్లేషణ చేసే స్థాయికి ఎదిగింది.

ఏడవ తరగతి నుండి నవదీప్ కవిత్వం ఎంతో బాగా రాస్తాడు.ఒక కవితా సంకలనానికి కావలసినన్ని కవితలను రాశాడు. కాబట్టే ఈ పాఠశాల తరువాత అతని విద్యా విషయాలు నేనే చూడాలని నిశ్చయించుకున్నాను.6వ తరగతిలోనే కథలు రాయడం అలవాటు చేసుకున్న లోహిత గొప్పగా కథలు రాస్తుంది.వీళ్లను చూసి మిగిలిన పిల్లలు కూడా ఏదొక రూపంలో కవితలు కథలు రాయడానికి ప్రయత్నం చేస్తుంటారు.

ఈ పుస్తకాలు చదవడం వల్ల పిల్లలు ఎంతో గొప్పగా ఎదుగుతారు. పిల్లల్లో ఆల్ రౌండ్ డెవలప్మెంట్ ఉంటుంది. తరగతిలో బాగా పుస్తకాలు







చదివే పిల్లలే అన్ని సబ్జెక్టులలో కూడా ముందుంటారు. పాఠశాలలో జరిగే అన్ని పోటీలలో ఈ పిల్లలే ముందు వరుసలో నిలుస్తారు.

### మా పాఠశాలలో పిల్లలు పుస్తకాలు చదవడానికి ఎన్నోసమయాలు ఉంటాయి.

1. ఉదయం పాఠశాలకు వచ్చిన వెంటనే పిల్లలకు అందుబాటులో పుస్తకాలు ఉంటాయి. అసెంబ్లీ మొదలయ్యే వరకు పుస్తకాలు చదువుతారు.
2. మధ్యాహ్నం భోజనం అయిన వెంటనే పుస్తకాలు తీసుకొని కూర్చుని చదువుతారు.
3. ఉపాధ్యాయులు సెలవు పెట్టిన రోజు ఆ పీరియడ్లో గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదువుతారు.
4. ప్రతి తరగతికి రెండు గ్రంథాలయం పీరియడ్లు ఉంటాయి. ఆ పీరియడ్ల లో పుస్తకాలు చదువుతారు.
5. సాయంత్రం బడి అయిపోయిన తరువాత ఒక గంట తప్పనిసరిగా పుస్తకాలు చదవాలి.
6. పుస్తకం చదవగలిగే ప్రతి విద్యార్థి బ్యాగులో తప్పనిసరిగా కథల పుస్తకం ఉంటుంది. కాబట్టి సెలవు రోజుల్లో కూడా పుస్తకం చదువుతారు.చదివిన పుస్తకాన్ని గురించి రాస్తారు ప్రతిరోజు పుస్తకంలో కొన్ని పేజీలు అయినా చదివి చదివిన పేజీలపై తప్పనిసరిగా రివ్యూ రాసుకుని వస్తారు.ఒకటవ తరగతి పిల్లలు కూడా తప్పనిసరిగా గ్రంథాలయానికి రావాలి.

ఆరవ తరగతి చదువుతున్న ఒక అమ్మాయి చాలా వేగంగా పుస్తకాలు చదువుతుంది. వాటి గురించి రివ్యూలు రాస్తుంది. ఒక రకంగా ఆ అమ్మాయిని దత్తత తీసుకున్నట్టే .ఆ అమ్మాయికి సివిల్స్ టార్గెట్ అని చెప్పి ఇంకా బాగా చదివేవిధంగా ప్రోత్సహిస్తున్నాను.

మా స్కూలు నుండి బయటకు పోయిన విద్యార్థులకు కూడా వాళ్ల చెల్లెళ్ళు, తమ్ముళ్ల ద్వారా పుస్తకాలు ఇంటికి పంపించి చదివించడం మా పాఠశాల ఆనవాయితీ. పిల్లల తల్లిదండ్రులు కూడా మాకు చదవడానికి పుస్తకాలు తెమ్మంటారు. వాళ్లకి అవసరమైన పుస్తకాలను నా గ్రంథాలయం నుండి కూడా తీసుకువెళ్లి ఇస్తాను. గ్రామంలో కొన్నిచోట్ల డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న యువతకు కూడా కొన్ని పుస్తకాలు ఇచ్చి మిత్రులందరూ చదువుకోండని చెప్తాను. ఈమధ్య బేల్దారి పనిచేస్తున్న ఒక యువకుడు హైదరాబాదు నుండి పని విరామంలో ఊరికి వచ్చి నా దగ్గర నుండి పుస్తకాలు తీసుకొని వెళ్లి చదువుతున్నాడు.

నిజంగా పుస్తకాలు ఎంత గొప్పవి. పిల్లలైనా పెద్దలైనా వాళ్ల తెలివికి మెరుగు పెట్టుకోవాలంటే గ్రంథాలయానికి మించిన సాధనం లేదు.

గొప్ప గొప్ప మేధావులు శాస్త్రవేత్తలు మంచి మనుషులు రచయితలు కవులు అంతా ఈ గ్రంథాలయం నుండి ఉద్భవించిన వారే.

విద్యార్థులు మంచి మనుషులుగా రూపొందాలంటే కచ్చితంగా పుస్తకాలు చదవాల్సిందే.

ఉపాధ్యాయులు మంచి ఉపాధ్యాయులుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆదర్శవంతమైన గురువులుగా పరిణతి చెందాలంటే గ్రంథాలయ పుస్తకాలను తప్పకుండా చదవాలి.

బై లింగ్వుయల్ కథలలో తప్పనిసరిగా తెలుగు ఇంగ్లీష్ రెండు చదవాలి అనే నియమం పెడతాను.అప్పుడు ఇంగ్లీష్ చదివి అర్థం కాని పదాలకు తెలుగులో అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

అప్పుడప్పుడు పిల్లలే చినిగిపోయిన పుస్తకాలకు చికిత్స జరుపుతారు. పిల్లలే పిన్నులు కొట్టడం దారంతో కుట్టడం మొదలైన పుస్తక చికిత్సలు చేస్తారు.

ప్రతి తరగతికి ఇద్దరు పిల్లలు గ్రంథాలయ లీడర్లుగా ఉంటారు. వాళ్ళు ఆ తరగతి పిల్లలకు పుస్తకాలు ఇవ్వడం, తీసుకోవడం వంటి పనులన్నీ చేస్తారు. ఒక నోట్స్ లో ఆ వివరాలన్నీ నమోదు చేసుకుంటారు.

### స్కూల్ మ్యాగజైన్:

పిల్లలు రాసిన కవితలు కథలు సరిదిద్ది వాళ్లకు ఏ4 తెల్ల కాగితాలు ఇచ్చి వాటిని తిరిగి నీట్గా రాయమంటే రాస్తారు. కలర్ అట్ట డిజైన్ చేయిస్తాను. అట్ట పేజీ కూడా పిల్లలు వేసిన బొమ్మలతోనే ఉంటుంది.

ఆ షీట్లను జిరాక్స్ తీయించి స్కూల్ మ్యాగజైన్ గా అందరికీ ఇచ్చి చదివిస్తాము.

ఆ మేగజైన్లో కథ, కవిత వచ్చిన పిల్లలు చాలా గొప్పగా ఫీల్ అవుతారు. ఈసారి మ్యాగజైన్లో నా రచన కూడా రావాలని మిగిలిన పిల్లలు కూడా పోటీ పడతారు.

డ్రాయింగ్ మ్యాగజైన్. డ్రాయింగ్ వేసే పిల్లల డ్రాయింగ్స్ అన్ని డ్రాయింగ్ మ్యాగజైన్ గా కూడా తయారు చేశాము.

## పాఠశాల గ్రంథాలయాలు – సమగ్ర వికాస కేంద్రాలు

పుస్తక పఠనం కేవలం అలవాటు కాదని, వ్యక్తి సర్వతోముఖ వికాసానికి, జ్ఞాన సముపార్జనకు, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి పునాది. మనం గాంధీ మహాత్ముణ్ణి కలుసుకోలేక పోవచ్చు. కానీ ఆయన ఆత్మకథను చదివినప్పుడు, ఆ మహాత్మునితో సంభాషించిన అనుభూతి కలుగుతుంది. అదీ పుస్తకం గొప్పదనం.

జాతీయ విద్యావిధానం (NEP-2020) పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. మన భాషలలో రాయబడిన ఉత్తమ గ్రంథాలను పాఠశాల విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, లైబ్రరీలు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేకేంద్రాలుగా మారాలని ఈ విధానం లక్ష్యంగా పెట్టుకుంది. దీన్నిసాధించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది.



## లక్ష్యాలు:

* అన్ని పాఠశాలలకూ తగిన సంఖ్యలో పుస్తకాలు అందుబాటులో ఉండాలి.
* ప్రతి తరగతికి అనుగుణంగా పుస్తకాలను పంపిణీ చేయాలి.
* ప్రతి విద్యార్థిలోనూ చదివే అలవాటు పెంపొందించాలి.
* 100% విద్యార్థులు సరళ వాక్యాలను చదివే స్థాయికి చేరాలి.

## అమలు – నిధులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించే లక్ష్యంతో నేషనల్ బుక్ ట్రస్ట్ (NBT), పబ్లికేషన్ డివిజన్, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (CIIL), మరియు NCERT వంటి సంస్థల నుండి తరగతికి తగిన పుస్తకాలను సేకరించి ప్రాథమిక, సెకండరీ మరియు సీనియర్ సెకండరీ పాఠశాలలకు సరఫరా చేసింది.

### పాఠశాల రకాన్ని బట్టి గ్రంథాలయ పుస్తకాల కోసం కేటాయించిన నిధుల వివరాలు:

* ప్రాథమిక పాఠశాలలు: ₹5,000
* అప్పర్ ప్రైమరీ పాఠశాలలు : ₹13,000
* సెకండరీ పాఠశాలలు: ₹15,000
* సీనియర్ సెకండరీ పాఠశాలలు : ₹20,000

పుస్తకాల పంపిణీని జాగ్రత్తగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్ అభివృద్ధి చేశారు. ఇది విక్రేత నుంచి జిల్లావరకు, జిల్లానుంచి పాఠశాల వరకు పుస్తకాల పంపిణీని పర్యవేక్షించడానికి ఉపయోగపడుతుంది. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని లైబ్రరీ నిర్వహణకు కేటాయించి వారిని వారానికి రెండు పీరియడ్లకు బోధన నుండి మినహాయింపు చేయవచ్చు.

### పుస్తకాల సరఫరా వివరాలు

| పాఠశాల | మొత్తం పుస్తకాలు | పాఠశాలలు |
|---|---|---|
| ప్రాథమిక (PRIMARY) | 99 | 34,206 |
| అప్పర్ ప్రైమరీ (UPPER PRIMARY) | 223 | 3,201 |
| సెకండరీ (SECONDARY) | 175 | 5,637 |
| సీనియర్ సెకండరీ (Sr. SECONDARY) | 209 | 1,730 |

– **డా. శారదా శ్రీనివాస్,** శామో

## పాఠశాల గ్రంథాలయ పుస్తకాలు చదివిన విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకుందాం.

### ఆ పుస్తకం చాలా ప్రత్యేకం అనిపించింది



"నేను భవ్య శ్రీ. పి.ఎం.శ్రీ డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో పదో తరగతి చదువుతున్నాను. నాకు గ్రంథాలయం అంటే చాలా ఇష్టం. నేను గ్రంథాలయంలో చాలా పుస్తకాలు చదివాను. నేను గ్రంథాలయం నుండి చాలా గ్రహించాను. గ్రంథాలయంలో "డైనమిక్స్ ఆఫ్ ఎచీవింగ్ గోల్స్". ఈ పుస్తకం నాకు చాలా ఇష్టం. కలలను కనడమే కాదు వాటి కోసం పోరాడాలని తెలుసుకున్నాను. నాకు ఇంతటి జ్ఞానాన్ని, నాకో లక్ష్యాన్ని ఇస్తున్న నా పాఠశాలను, గ్రంథాలయాన్ని ఎప్పటికీ మర్చిపోను."

### పుస్తక పఠనం మంచి అలవాటు



"నేను పావని పీ.ఎం. శ్రీ. డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, వట్లూరులో పదవ తరగతి చదువుతున్నాను. మా పాఠశాలలోని గ్రంథాలయంలో సైన్స్, హిందీ, ఇంగ్లీష్ వంటి పుస్తకాలు చదవడం వల్ల ఆ సబ్జెక్ట్స్ తొందరగా నేర్చుకోవడానికి మాకు వీలు కలుగుతుంది. నేను "యూపీఎస్సీ శిఖరాగ్రం చేరుకుందాం" అనే పుస్తకం చదివాను. అందులో కొంతమంది వ్యక్తులు యూపీఎస్సీ చేధించాలన్నది వారి కల వారికి ఎన్ని కష్టాలు వచ్చినా వెనకడుగు వేయకుండా వారు ఆ కలను సహకారం చేసుకున్నారు. ఈ పుస్తకం నాకు స్ఫూర్తిని ఇచ్చింది.

### చరిత్ర పుస్తకాలంటే ఇష్టం



"నా పేరు ఎమిలీ. నేను పి.ఎం.శ్రీ డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం వట్లూరులో పదో తరగతి చదువుతున్నాను. మా పాఠశాల గ్రంథాలయంలో మేము కథల పుస్తకాలు, చరిత్రను వివరించే పుస్తకాలు మరెన్నో చదివాము. ఇలాంటి పుస్తకాలు చదవడం ద్వారా మేము మా పాఠ్యపుస్తకంలో లేని ప్రశ్నలకు కూడా జవాబు ఇవ్వగలుగుతున్నాము. మా గ్రంథాలయంలో నేను "ఫెస్టివల్స్ ఆఫ్ ఇండియా" అనే పుస్తకాన్ని చదివాను. ఆ పుస్తకం చదవడం ద్వారా మన భారతదేశంలో ఏ విధమైన పండుగలు చేస్తారో, అలాగే మన భారత దేశ సాంప్రదాయాలు తెలుసుకున్నాను ఈ పుస్తకంలో బుద్ధ పూర్ణిమ, బిహూ, లోహ్రీ మొదలగు పండుగల గురించి తెలుసుకున్నాను.

సేకరణ: **ముంజులూరి కృష్ణకుమారి,**
విశ్రాంత ఆకాశవాణి డైరెక్టర్, బాలసాహిత్య రచయిత్రి

# బూతులే భాష.. తిట్లే పలకరింపులు


## తెలియకుండానే పిల్లల్లో పెరుగుతున్న విష సంస్కృతి

### తల్లిదండ్రులు, పరిసరాలు, సినిమా, ఓటీటీ, సోషల్ మీడియా భాషతో ప్రభావితులవుతున్న పిల్లలు

పాఠశాల విద్యార్థుల మధ్య జరుగుతున్న సంభాషణలలో బూతు మాటల వినియోగం ఒక సమస్యగా తయారయింది. తిట్లు పలకరింపుల్లా మారాయి. మొదట ఇది కొన్ని గ్రామీణ స్కూళ్లకు లేదా కొన్ని రకాల పాఠశాలలకు మాత్రమే పరిమితమయిన సమస్యగా చెప్పేవారు. కానీ అనుభవాలు, నివేదికలు ఇస్తున్న సమాచారం ప్రకారం ఇది అన్ని రకాల, అన్ని ప్రాంతాల స్కూళ్ళలో ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా ఉన్న సమస్య అని అర్థం అవుతున్నది. దేశరాజధాని ఢిల్లీలోనే ఈ సమస్య ఉన్నపుడు ఇక రాష్ట్ర రాజధానులు, మిగతా పట్టణాలు, పల్లెలు, తండాల గురించి చెప్పే పనిలేదు.

అశ్లీలంతో కూడిన బూతు పదాలను పిల్లలు మొదట ఎక్కడ వింటారు? వీటిని ఎవరు నేర్పిస్తారు? ఈ స్థితిని ఎలా నియంత్రించాలి? అనేవి అందరం ఆలోచించవలసిన ప్రశ్నలు. కొందరు పేరెంట్స్ చుట్టుపక్కల వారితోనో, ఫోన్ లోనో, కోపంలో ఉన్నపుడో వాడిన బూతులను పిల్లలు వింటారు లేదా వీళ్ళు నివసిస్తున్న ప్రాంతంలో గానీ, పని ప్రదేశాలలో గానీ, ప్రయాణాల్లోగానీ ఎవరైనా వాడినపుడు విని ఉంటారు.

ఈ మధ్య కాలంలో మీడియా, సోషల్ మీడియా చర్చలలో, సినిమాలలో మరీ ముఖ్యంగా ఓ.టి.టి లో వస్తున్న సినిమాలలో, వెబ్ సిరీస్ లలో అశ్లీల మాటల వినియోగం ఎక్కువయిన సంగతి అందరికీ తెలిసిందే! హెడ్ ఫోన్స్ లేకుండా సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలను చూసే పరిస్థితిలేదు. కొందరు అసలు బూతులను కాకుండా అలాంటి శబ్దాలు వచ్చే పదాలను వాడుతున్నారు. ఇవన్నీ పిల్లలకు అందుబాటులో ఉంటున్నాయి.



పీర్ గ్రూపు పిల్లల మధ్య ఇలాంటివి మొదట వాడకంలోకి వస్తాయి. బూతు మాటలతో అశ్లీల అర్థాలు వచ్చే సంజ్ఞలు చేయడం, వాటిని మెసేజ్ రూపంలో టెక్స్ట్ చేయడం పిల్లల మధ్య జరుగుతున్నది. ఇతరుల దృష్టిని తమవైపు మరల్చుకోవడానికి లేదా తాము ధైర్యవంతులమని చూపించుకోవడానికి, మేం పెద్దవాళ్ళం అయిపోయామని చెప్పడానికి లేదా మేం కూడా ట్రెండ్ ఫాలో అవుతున్నామని కొందరు పిల్లలు బూతులు వాడుతున్నారు. చాలామంది పిల్లలకు వాళ్ళు వాడుతున్న బూతులకు అసలైన అర్థాలు తెలియవు. కొందరు పిల్లలు సరదాకు బూతులు వాడితే మరికొందరు పిల్లలు కోపాన్ని, భావోద్వేగాలను నియంత్రణ చేయలేని స్థితిలో చెడుమాటలను వాడుతున్నారు. పది శాతం తక్కువ కావొచ్చుగాని ఈ పదాలు అమ్మాయిలు కూడా వాడుతున్నారు. ఎవరు అడ్డుకోకపోతే కొంతకాలానికి ఇలాంటి భాష ఆమోదయోగ్యమే అనే స్థితికి చేరుకుంటారు.

పిల్లల భాష గురించి పేరెంట్స్, టీచర్స్ దృష్టి పెట్టాలి. అశ్లీల పదాలు, బూతులు, చెడుపదాలు ఎందుకు ఉపయోగించకూడదో సరళమైన రీతిలో వివరించాలి. అలాంటి పదాలు ఇతరుల భావాలను దెబ్బతీస్తాయని, స్త్రీలను కించపరిచేవిగా ఉంటాయని, అలాంటి పదాలు వాడటం చాలా మందికి ఇష్టం ఉండదని చెప్పాలి. కొన్ని బూతులకు అర్థాలు ఏమిటో వివరించాలి. ఈ పని అందరిముందు చేయకూడదు.

బూతులు వాడటం అపార్థాలకు, ఘర్షణలకు దారి తీయవచ్చుననీ, బూతులు ఒక స్థితి దాటితే నేరం అవుతుందనీ, అన్నింటికీ మించి సమాజంలో గౌరవాన్ని కోల్పోతామనీ పిల్లలకు మృదువుగా చెప్పాలి.

ఇలాంటి చెడు పదాలను పిల్లలు వాడకుండా ఉండటానికి కుటుంబ విలువలు, క్రమశిక్షణ బాగా తోడ్పడుతాయి. భావోద్వేగాలను నియంత్రించుకోవడం, భాష, నడవడిక ఇతరులకు రోల్ మోడల్ గా ఉండటం వంటివి పెద్దలు పిల్లలకు విధిగా నేర్పించాలి. పేరెంట్స్ తాము మాట్లాడే మాటలను పిల్లలు వింటారనే స్పృహతో మాట్లాడాలి.

టీచర్లు తరగతి గదిలో పిల్లల భాషను అవసరమైన మేరకు సరి చేయాలి. మంచి భాషను మాట్లాడే పిల్లలను ప్రోత్సహించాలి. చదువుతోపాటు సంస్కారం ఉంటేనే బాధ్యతాయుత పౌరులు కాగలరని, మంచి మాటలతో మనుషులను, కొన్నిసార్లు శత్రువులను గెలుచుకున్న ఉదాహరణలను వివరించాలి.

నోరుమంచిదయితే ఊరు మంచిదవుతుందని, కత్తి చేసే గాయాలు మానుతాయి గానీ మాటలు చేసే గాయాలు మానవని మనకు తెలుసు. అందువలన బాల్యంలోనే పిల్లల భాషను సరిదిద్దితే భవిష్యత్తులో ఉద్యోగ, వ్యాపార, వ్యక్తిగత జీవితం సాఫీగా సాగుతుంది.

– **డా. పుల్లూరి సంపత్ రావు**, విద్యావేత్త

# నైతిక విలువలు పెంపొందించేలా

# బాల సంస్కార్

'మొక్కై వంగనిది మానై వంగునా... అన్న పెద్దల మాట జీవిత సత్యం..ప్రతి విద్యార్థి పాఠశాల దశలోనే జ్ఞానసముపార్జితులవుతారు. వారికి ఈ దశలో లభించే నైతిక విలువలు ఎంతో ముఖ్యమైనవి.. ఇవి మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి, సమాజంలో సత్ప్రవర్తనతో మెలగడానికి సహాయపడతాయి. నైతిక జ్ఞానం మంచిచెడులను, విచక్షణను తెలియజేస్తుంది. సమాజ హితానికి మనం చేయాల్సిన పనులను సూచిస్తుంది. సమాజంలో మన ప్రవర్తనను మెరుగుపరుస్తుంది.. ఇంతటి ప్రాధాన్యతను కలిగిన నైతిక విలువలకు పట్టం కట్టేలా.. విద్యార్థులు పాఠశాలతో పాటు తమఇంటి నుంచే నైతిక విలువలు అలవర్చాలన్న సత్ సంకల్పంతో రూపుదిద్దుకున్న ప్రయోగాత్మక కార్యక్రమం బాలసంస్కార్'..



విద్యాశాఖలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అంది పుచ్చుకోవడంతో పాటు వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యత కల్పించేలా 'వీకెండ్ వర్క్'ను అందిస్తూ విద్యార్థులను సంస్కరించేలా చేపట్టిన కార్యక్రమం 'బాల సంస్కార్'. కడప నగరం సాయిపేటలోని 8వ వార్డు నగరపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పురుడు పోసుకున్న ఈ కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి చక్కటి స్పందన లభిస్తుండటంతో పలు పాఠశాలలు సైతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నద్ధులవుతుండటం గమనార్హం.



## తల్లిదండ్రుల ప్రశ్నతో.. 'బాల సంస్కార్'కు శ్రీకారం..

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను తరచుగా తల్లిదండ్రులు కలిసి సార్ ఆదివారం వస్తే మా పిల్లలు మా మాట వినడం లేదు.. ఒక్క పనిచేయరు.. చెప్పిన మాట వినరు. సెల్ ఫోన్, టీవీకి అతుక్కుపోతారంటూ చిన్నారుల గురించి చెబుతుండేవారు. ఇది ఒకరిద్దరి విద్యార్థుల సమస్యకాదు.. చాలామంది విద్యార్థుల సమస్య ఉందని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గుర్తించి, సమస్యకు పరిష్కారం ఆలోచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని, బాలలను సంస్కరించాలన్న ఉద్దేశంతో 'వీకెండ్ వర్క్' (వీకెండ్ విద్య)ను నేర్పించేలా 'బాల సంస్కార్' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## వీకెండ్ విద్య'కు విశేష స్పందన..

వీకెండ్ విద్యలో భాగంగా విద్యార్థులకు రోజువారీ హోంవర్క్ పాటు ఆదివారం రోజున తప్పనిసరిగా తల్లిదండ్రులకు వారి ఇంటిపనుల్లో, దైనందిత కార్యక్రమాల్లో సేవలందించాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైతే ఇంటిపని బాగా చేయడంతో పాటు, తల్లిదండ్రులకు ఎంతమేర సహకారం అందిస్తారో వారికి ప్రోత్సాహకం అందిస్తామని. తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. దీంతో చిన్నారులు ఆదివారం వచ్చిందంటే చాలు.. ఇంటిపనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేయడం ప్రారంభించారు. తమ చిన్నారులు ఇంట్లో తమకు చేదోడుగా ఉండడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.మాపిల్లలు ఇంట్లోపనిబాగాచేస్తున్నారంటూ వీడియోలు తీసి తరగతి వాట్సాప్ గ్రూప్ లో పోస్టు చేస్తూ తమ సంతోషాన్ని తెలియజేస్తున్నారు. తాము కూడా 'బాల సంస్కార్' చేపడతామంటూ మరికొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ముందుకు వస్తుండటం విశేషం.





## పాఠశాల ప్రత్యేకతలు ఎన్నో..

● కడప నగరం సాయిపేటలోని 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఇటీవలే రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడంతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సైతం తమ సామాజిక మాధ్యమాల్లో పాఠశాల చిత్రాన్ని పోస్టు చేయడంతో పాటు అభినందనలు తెలిపారు.

● జూలై 10వ తేదీన నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ లో ఫొటో బూత్ ఫ్రేమ్ రూపకల్పనలో పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన ఫొటోఫ్రేమ్ రాష్ట్రస్థాయిలో ప్రాచుర్యం

పొందడంతో పాటు సమగ్రశిక్షా పోర్టల్ లో ముఖచిత్రంగా అవకాశం దక్కించుకుంది.

● 1–5 తరగతులకు సంబంధించి విద్యార్థుల సంఖ్యను అనుసరించి ఒక్కో తరగతి గది ఒక్కో రకమైన సీటింగ్ విధానంతో విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ఉపాధ్యాయులు సైతం వినూత్న బోధనలకు, డిజిటల్ కంటెంట్ వినియోగం, రెడీనెస్ కార్యక్రమాలు, యోగాంధ్ర, ప్రభుత్వం నిర్దేశించి కార్యక్రమాల నిర్వహణలో ప్రత్యేకతను చూపుతుండటం విశేషం.

● దాదాపు 140 మంది వరకు విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం హెచ్ఎంతో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ఉపాధ్యాయుల కొరత కాస్త ఇబ్బందికరంగా మారింది.

## ఉత్సాహంగా చేస్తున్నాం..



'బాల సంస్కార్' లో భాగంగా సెలవు రోజుల్లో తల్లిదండ్రులకు సేవ చేయాలని మా ఉపాధ్యాయులు సూచించారు. ప్రతిరోజూ మా కోసం కష్టపడే మా తల్లిదండ్రులకు మేము కూడా ఒకరోజు పనిచేసి వారికి సహాయపడటం సంతోషంగా ఉంది. మేము 'బాలసంస్కార్' కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. మా అమ్మానాన్నలు అభినందిస్తుంటే సంతోషంగా ఉంది.

– **యశస్విని**, 5వ తరగతి

## చాలా మంచి కార్యక్రమం..

విద్యార్థుల్లో పని పట్ల బాధ్యత తెలిసేలా నిర్వహిస్తున్న ఈ బాల సంస్కార్ కార్యక్రమం ఎంతో మంచి నిర్ణయం. దీని ద్వారా విద్యార్థులకు పని పట్ల గౌరవం పెరగడంతో పాటు తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. మా పిల్లలు ఆదివారం వచ్చిందంటే చాలు మేము పనిలో సహకరిస్తామంటూ ముందుకు వస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– **ఒక పేరెంట్**

## నైతిక విలువలు పెంపొందించేలా కార్యక్రమం..



ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు ఎంతో ముఖ్యం. ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం పెంచేలా, తల్లిదండ్రులకు వారి పిల్లలు మధ్య అనుబంధం పెంచేలా ఉన్న ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయం. దీని ద్వారా మా పిల్లలు కూడా ఇంట్లో చక్కగా పనిచేస్తున్నారు.

– **వై. రాధిక,** పాఠశాల యాజమాన్యకమిటీ చైర్ పర్సన్. 8వ వార్డు నగరపాలక ప్రాథమిక పాఠశాల, సాయిపేట, కడప





## తల్లిదండ్రుల కష్టం పిల్లలకు తెలియజేసేందుకు..



పిల్లల కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తూ ఉంటారు. వారు పడే కష్టం, త్యాగం చిన్నారులకు తెలియజెప్పడంతో పాటు వారికి పనిపట్ల గౌరవం, బాధ్యత తెలియజేసేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులతో కలిసి నిర్ణయం తీసుకుని విద్యార్థుల్లో మార్పునకు శ్రీకారం చుట్టాం. తల్లిదండ్రుల నుంచి చక్కటి స్పందన లభించడం సంతోషంగా ఉంది.

– **దాది నాగరాజు,** ప్రధానోపాధ్యాయులు, 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాల, సాయిపేట, కడప, 90598 51188



# ఎడ్యుటైన్‌మెంట్

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు నయా ట్రెండ్**
**సోషల్ మీడియా వేదికగా ఎంతో మందికి స్ఫూర్తి**
**ప్రత్యక్షంగా పాఠశాలలో, పరోక్షంగా ఆన్లైన్ లో విద్యావిధానాలు**
**టీచర్ల వినూత్న బోధనతో మెరికల్లా తయారవుతోన్న విద్యార్థులు**






సోషల్ మీడియా.....ఇదొక పెద్ద ప్రపంచం...పొద్దున లేచి టైమ్ చూసిన మొదలు, రాత్రి ఇన్స్టాగ్రామ్ లో రీల్స్, వాట్సప్ లో స్టేటస్ చూసేవరకు సామాజిక మాధ్యమాల్లో మనమంతా మునిగితేలుతున్నాం. అలాంటి సోషల్ మీడియాను విద్యకోసం, విద్యార్థులకోసం, తల్లిదండ్రులకోసం ఉపయోగించి, స్ఫూర్తినిచ్చే విధంగా ఎడ్యుకేషన్ కంటెంట్ ని పోస్ట్ చేస్తూ మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు..

ఎంటర్ టైన్ మెంట్ ద్వారా ఫాలోవర్లను సంపాదించడం ఈ రోజుల్లో కొంచెం సులభమే కానీ.. ఎడ్యుటైన్ మెంట్ ద్వారా లక్షల మంది ఫాలోవర్లు, సబ్ స్క్రైబర్లు, కోట్లలో వ్యూస్ తో రికార్డు సృష్టించి ట్రెండ్ సెట్ చేసి.. ప్రభుత్వ విద్యే కాదు, ప్రభుత్వ టీచర్లు కూడా ఎందులోనూ తీసిపోరని నిరూపిస్తున్నారు మన ఉపాధ్యాయులు..

ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రపంచానికే దిక్సూచి కావాలనే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోధన మారుతున్న ట్రెండుకి తగ్గట్టుగా పాఠాలను బోధిస్తున్నారు.. ఆ కంటెంట్ ను అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫాంలలో పోస్ట్ చేస్తున్నారు.. వాటిని ఆదరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, సోషల్ మీడియా యూజర్ల నుండి ఈ ఉపాధ్యాయులకు ఎంతో గుర్తింపును తెచ్చిపెట్టింది..

స్కూల్లో ఆఫ్ లైన్ లో బోధన, సోషల్ మీడియా ద్వారా ఆన్ లైన్లోనూ ప్రతిభ చాటుతోన్న ఉపాధ్యాయుల గురించి, వారి బోధనా పద్ధతుల గురించి తెలుసుకుందాం.



## ఈ మాస్టారు ట్రెండ్ సెట్ చేస్తారు.

GR.Antiques – ఈ పేరులోనే ఒక ప్రత్యేకత ఉంది కదూ.. 'GR.Antiques' పేరు మీద, ఎన్నో వందల సంవత్సరాల క్రితం వాడిన యాంటిక్ వస్తువులు (పురాతన వస్తువులు) సేకరించి అవి పిల్లలకు చూపించి, వాటి ప్రత్యేకతతో పాటు చరిత్రను బోధిస్తున్నారు.. అంతే కాదండోయ్... యూట్యూబ్, ఫేస్బుక్, ఇన్ స్టాగ్రామ్, ట్విట్టర్ ఎక్స్, థ్రెడ్స్, వాట్సప్ ఛానల్ వంటి అన్ని సోషల్ మీడియా అకౌంట్లలో 7 లక్షల ఫాలోవర్లు ఈ మాస్టారికి ఉన్నారు.. అన్ని కలిపి 30 కోట్ల పైనే వ్యూస్ వచ్చాయి.. ఈ మాస్టారు పేరు కొరుపోలు గంగాధర్. అనకాపల్లి జిల్లా, పరవాడ మండలంలో బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సింగిల్ టీచర్ (ఎస్జీటీ) గా పనిచేస్తున్నారు. సామాజిక స్పృహ కలిగేలా విద్యార్థులతో చిన్న చిన్న స్కిట్స్ వేయించడం, అంతరించిపోతున్న ఆటలను ఆడించడం, విద్యార్థులను టీంలుగా విభజించి వినూత్నంగా పాఠాలను నేర్పిస్తున్నారు ఈ మాస్టారు.. తన విద్యార్థులకు భారతదేశం, ఆంధ్రప్రదేశ్ చరిత్రను వినూత్నంగా రీల్ రూపంలో తయారుచేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.. వాటితో పాటు, విద్యార్థులు బాల్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నేర్చుకోవలసిన విషయాలను, నైతిక విలువలను నేర్పిస్తున్నారు. తన దగ్గర చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు, మరికొంతమంది ఆర్మీలో సైనికులుగా ఉన్నారు. ఈ మాస్టారు చేస్తున్న కృషిని గుర్తించిన ప్రభుత్వం 2024 లో స్టేట్ బెస్ట్ అవార్డు తో సత్కరించింది. ఇటీవల తన దగ్గర 1వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆరాధ్య బెహరా మైండ్ మ్యాపింగ్ యాక్టివిటీలో వండర్ బుక్ ఆఫ్ రికార్డు కూడా సంపాదించింది.




## మంగారాణి పాఠాలు

Mangarani Lessons – యూట్యూబ్ లో ఎడ్యుకేషన్ కంటెంట్ చూసేవారికి, ఆంధ్రప్రదేశ్ లో చాలా మంది ఉపాధ్యాయులకు, మోటూరి మంగారాణి టీచర్ సుపరిచితులే.. తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరంలోని లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మ్యాథమెటిక్స్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు. ఆట పాటల ఆధారితంగా పాఠాలు, స్ఫూర్తి కథలు, 3డి యానిమేషన్ వీడియోలు రికార్డు చేసి యూట్యూబ్ లో 2012 నుండి ఎడ్యుకేషన్ కంటెంట్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు..



నేడు సోషల్ మీడియాలో మంగారాణి లెసన్స్ చాలా ఫేమస్.. యూట్యూబ్ లో ఈ ఛానెల్ కు రెండు లక్షల నలభై వేలకి పైగా సబ్ స్క్రైబర్స్ ఉన్నారు.



సబ్జెక్టు మ్యాథ్స్ తో పాటు పిల్లలతో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ యాక్టివిటీస్ చేయించడం, నో బ్యాగ్ డే నాడు పిల్లలతోనే చైతన్యవంతమైన కార్యక్రమాలు చేయిస్తూ వినూత్న బోధన చేస్తుంటారు. తన పాఠశాలలోని విద్యార్థులకు ప్రత్యక్షంగా, మంగారాణి లెసన్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా పరోక్షంగా ఎంతోమందికి టీచర్ అయ్యారు.. మంగారాణి టీచర్ చేస్తున్న కృషిని గుర్తించిన ప్రభుత్వం 2025 లో స్టేట్ బెస్ట్ అవార్డుతో సత్కరించింది..




## బోధనకు కళ జోడిస్తే... అప్పలరాజు మాస్టారు

ఈ మాస్టారుకి కళాత్మకంగా బోధించడం అంటే చాలా ఇష్టం. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోటనీ సబ్జెక్టు బోధిస్తూనే తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో బయోలజీ, బోటనీ ల్యాబ్‌లను ఆకర్షణీయంగా, విజ్ఞానవంతంగా తీర్చిదిద్దారు. సైన్స్, మోరల్ వాల్యూస్, జనరల్ నాలెడ్జ్ ప్రతిబింబించేలా ల్యాబ్‌ను ఆర్టిస్టిక్‌గా రూపొందించి, నిర్వహిస్తున్నారు ఈ మాస్టారు. ఈయన పేరు బల్లెడ అప్పలరాజు, శ్రీకాకుళం జిల్లాలోని, పాతపట్నం ఎ.పి మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజీలో బోటనీ పీజీటీగా పని చేస్తున్నారు.



పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అనుగుణంగా బయాలజీ లో కష్టమైన చిత్రాలను సులభంగా ఎలా వేయాలో ఈజీ మెథడ్ లో వీడియోలుగా చేసి 'రాజ్ బల్లెడ ఫన్ అండ్ లెర్న్' అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా తన విద్యార్థులతో పాటు, అందరికీ చేరువయ్యేలా సోషల్ మీడియా వేదికగా ఎంతోమంది విద్యార్థులకు ఫన్ అండ్ లెర్న్ అంశాలు నేర్పిస్తున్నారు. తన విద్యార్థులతో కలిసి ఎనర్జీ కన్జర్వేషన్, బయోడైవర్సిటీ కన్జర్వేషన్, ఓజోన్ ఆవశ్యకత వంటి సైన్స్ అంశాలపై లఘుచిత్రాలు రూపొందించారు. ఈ మూడింటికి రాష్ట్రస్థాయి అవార్డులు, ఒకదానికి జిల్లాస్థాయి అవార్డు వచ్చాయి.. పాతపట్నం ఆదర్శ పాఠశాలలో దేశ నాయకులు, శాస్త్రవేత్తలు, సైన్స్ సంబంధించిన చిత్రాలను ఎంతో సుందరంగా చిత్రీకరించి విద్యార్థులకు విద్య పైన ఆసక్తిని పెంచుతున్నారు.ఇటీవల మాస్టారు చేస్తున్న కృషిని గుర్తించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, తన సోషల్ మీడియా వేదిక గా ప్రశంసించారు.

## పాఠాలే.. పాటలుగా గణిత సంగీతం



Maths made easy with 'MUSIC' – సాధారణంగా విద్యార్థులు మ్యాథ్స్ అంటే చాలా భయపడుతూ ఉంటారు. కానీ ఫార్ములా అర్థమైతే ప్రాబ్లమ్స్ ని ఈజీగా సాల్వ్ చేయచ్చు.. అదే ఫార్ములా కి ట్రెండింగ్ లో ఉన్న పాట తగ్గట్టుగా రాసి పాడితే ఎలా ఉంటుంది ? వినడానికే ఆశ్చర్యంగా ఉంది కదూ.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని ఒక మాస్టారు అదే పని చేశారు.. Maths made easy with 'MUSIC' – అనే ఆలోచనతో... ట్రెండింగ్ లో ఉన్న సినిమా పాటను ఏదైనా ఎంపిక చేసుకుని, కొంచెం కష్టంగా ఉన్న ఏదైనా ఫార్ములాని ఆ పాటలోని లిరిక్స్ కి తగ్గట్టు ఆయనే కంపోజ్ చేసి, ఫార్ములానే పాటగా పాడతారు.. ఇలా ఒకటి రెండు వీడియోలు చేసి సోషల్ మీడియా లో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్ లో ఆ వీడియో ట్రెండింగ్





మారడంతో ఈ మాస్టారుకి ఇలాంటి వీడియోలు మరిన్ని చేసి, మ్యాథ్స్ లో ఫార్ములాలను ఈజీగా సాల్వ్ చేసే ట్రిక్స్ కనిపెట్టారు... ఇంతకీ ఈ గోదావరి జిల్లా మాస్టారు పేరు ఏంటో తెలుసా ? **పాలెపు నాగేశ్వరరావు...**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, వెదురుపాక సావరం లోని MPUP స్కూల్లోని మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన సోషల్ మీడియా ఛానల్స్ లో లక్షకు పైగా ఫాలోవర్లు, సబ్ స్క్రైబర్లు, మూడు కోట్ల మంది పైగా వీక్షకులు ఉన్నారు.. నాగేశ్వరరావు మాస్టారు గానం చేసిన పాటలకు మిలియన్స్ దాటి వ్యూస్ వచ్చాయి. తన విద్యార్థులు అభినయం చేసిన, ప్రతిభ చాటిన వీడియోలు రీల్స్ గా చేసి మ్యాథ్స్ సింగర్ అనే యూట్యూబ్ ఛానల్ లో అప్లోడ్ చేస్తున్నారు. ఈ ఛానల్ విద్యార్థుల కోసం 2003లో ప్రారంభించారు.

## అక్షరాలా అండ.. బెల్లంకొండ మాస్టారు



కొన్ని చిత్రాలు చూస్తే చాలు, అవి మనతో మాట్లాడుతున్నట్టు ఉంటుంది, వాటిలో జీవం ఉంటుంది, ఎప్పుడు చూసినా కొత్తగా ఉంటుంది.. బొమ్మలు చాలా మంది గీస్తారు కానీ, ఆ బొమ్మకి కళను జోడించే వారు చాలా అరదుగా ఉంటారు.. అందులో బెల్లంకొండ వెంకట్ మాస్టారు ఒకరు..

### ఆయన డ్రాయింగ్ టీచర్, నటుడు, సాహితీవేత్త, ఎన్.సీ.సీ ఆఫీసర్, ఆర్టిస్ట్, శిల్పి, సోషల్ మీడియా యాక్టివిస్ట్.. ఇలా మరెన్నో ..

బెల్లంకొండ మాస్టారు ప్రస్తుతం గుంటూరు జిల్లా తెనాలి మారిస్ పేట NCRNM హై స్కూల్ లో డ్రాయింగ్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. చిత్రలేఖనం అంటే ఆయనకి ప్రాణం, అందుకే కాబోలు ప్రతి చిత్రంలో జీవం ఉంటుంది. కాలేజీ రోజుల నుండి బొమ్మలు గీసేవారు, చివరకి అదే వృత్తి అయింది. హీరోల బొమ్మల నుండి రాజకీయ నాయకుల బొమ్మలు ఎన్నో గీసారు.."కళ కూడా వృత్తే" అని నమ్మే బెల్లంకొండ మాస్టారు, తనకు తెలిసిన కళను, నాటకాలను, బొమ్మలు గీయడం వంటి వాటిని విద్యార్థులకు నేర్పడంతో పాటు, అవి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసి, కొన్ని వేలమందికి గురువు అయ్యారు. అంతరించిపోతున్న నాటకరంగం గురించి విద్యార్థులకు కళాత్మకంగా నేర్పిస్తున్నారు. తను ఏ పాఠశాలలో పనిచేస్తే ఆ పాఠశాల బోర్డు అందమైన అక్షరాలా స్వాగతం పలుకుతుంది. బడి గోడలన్నీ వెంకట్ మాస్టారి అక్షరాలతోనే అలంకరిస్తారు.



## బెస్ట్ రిసోర్స్ పర్సన్ ... సౌజన్య టీచర్



విద్యావ్యవస్థలో సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తుంది. గ్యారెంటీడ్ ఎఫ్ ఎల్ ఎన్, ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయి నుండి పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అర్థమవ్వాలంటే ఉపాధ్యాయుల పాత్రే కీలకం. అందుకోసం ట్రైనింగ్ సెషన్స్ జరుగుతూ ఉంటాయి. ఆ ట్రైనింగ్స్ లో స్టేట్ రిసోర్స్ పర్సన్ అయిన సౌజన్య టీచర్ బోధనా పద్ధతుల గురించి తెలుసుకుందామా?

యాతం సౌజన్య, బాపట్ల పట్టణం వృక్షనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన ఎఫ్ ఎల్ ఎన్ కిట్లు, జాదూయి పిఠారా కిట్ లను ఉపయోగిస్తూ పిల్లలకి అర్థమయ్యేలా, ఆట పాటల ద్వారా పాఠాలను బోధిస్తున్నారు.. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఎలా తయారు



చేయాలి? ప్రభుత్వం నుండి వచ్చిన కిట్లు ఎలా ఉపయోగించాలో వీడియోలు తయారు చేసి SOWJANYATLM అనే యూట్యూబ్ ఛానెల్ లో పోస్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం రెండు లక్షల యాభై వేలకు

పైగా సబ్ స్క్రైబర్లు, దాదాపు పది కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి.. టీచింగ్ కోసం కూడా కంటెంట్ ఈజ్ కింగ్ అని నిరూపించడంలో సౌజన్య టీచర్ ఎప్పుడూ ముందుంటారు..

టీచర్లకు, విద్యార్థులకు 'DIKSHA' ప్లాట్ ఫాంలో ఇ-కంటెంట్ తయారు చేయడం, టీచర్ HANDBOOK రాయడం, ప్రశ్నపత్రాలు కూడా తయారు చేశారు సౌజన్య టీచర్. ఉపాధ్యాయునిగా అనుభవం, ట్రైనింగ్స్ పై పట్టు ఉండటంతో FLN ట్రైనింగ్ సెషన్స్ లో స్టేట్ రిసోర్స్ పర్సన్ గా ఉన్నారు. ఇటీవల నూతనంగా రిక్రూట్ అయిన ఉపాధ్యాయులకు బాపట్ల జిల్లాలోని ఇండక్షన్ ట్రైనింగ్ కూడా ఇచ్చారు.. తన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం 2018 లో ఒకసారి, 2022 లో ఒకసారి డిస్ట్రిక్ట్ బెస్ట్ టీచర్ అవార్డు, 2023లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది.



## టీచర్ కావేరి..బోధనలో కొత్త దారి

పిల్లల వయసు, ఆలోచనలకి తగ్గట్టు వినూత్నమైన బోధనా పద్ధతులతో పాఠాలు చెప్పడం కావేరి టీచర్ ప్రత్యేకత. ఆటపాటలతో చదువు నేర్పిస్తూనే నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, దేశభక్తిని బోధిస్తున్నారు. తన బోధన విధానాలు తన విద్యార్థులతో పాటు, ఇతర చిన్నారులకు కూడా ఉపయోగపడాలనే ఉద్దేశంతో, ఎఫ్ ఎల్ ఎన్ పునాది అభ్యసనాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, జాదూయి పిటారా వంటి కిట్లతో వీడియో కంటెంట్ తయారు చేసి కావేరి టీచర్ పేరుతో ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేస్తున్నారు..




*“Activity based learning is the best way of education”* ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు పునాది అభ్యసన బలంగా ఉండాలంటే.. యాక్టివిటీ ఆధారంగా పాఠాలు నేర్పాలని బలంగా నమ్ముతారు కావేరి టీచర్.. అందుకే, విద్యార్థులకు తగ్గట్టు యాక్టివిటీలతో తెలుగు, ఇంగ్లీష్ వర్ణమాలను ఆటలు, పాటలు, డాన్సులతో నేర్పిస్తారు. అకడమిక్స్ తో పాటు, నైతిక విలువలు, గుడ్ టచ్– బ్యాడ్ టచ్, సీపీఆర్ ఎలా ఇవ్వాలి? ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలి? వంటి విషయాలపై మూకీ చిత్రాలుగా రూపొందించి రీల్స్ రూపంలో సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తున్నారు.. నో బ్యాగ్ డే రోజున, తన విద్యార్థులతో పాటు కిచెన్ గార్డెన్ ను అభివృద్ధి చేయడం, డ్రాయింగ్ వేయించడం వంటివి చేయిస్తుంటారు.. చదువుల సరస్వతి సావిత్రి బాయి పూలే, గొప్పతనం చాటేలా తన విద్యార్థినితో వేషధారణ వేయించి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసి, ఎందరో మహానుబావుల అందరి గురించి విద్యార్థులకు నేర్పిస్తున్నారు.. కావేరి, ప్రస్తుతం మండపేట శారదా మున్సిపల్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు.



## విలువల విద్య అందించే.. – కౌసల్య టీచర్



మనిషిని సరైన బాటలో నడిపించేవి విలువలే.. ఆ విలువలు బాల్యంలోనే నేర్పించాలి అంటున్నారు కౌసల్య టీచర్.. అందుకోసం, తెలుగు లోని సామెతలను, సూక్తులను క్రమం తప్పకుండా తన విద్యార్థులకు ప్రతిరోజు బోధిస్తుంటారు ఆమె. ప్రతి టీచర్ కు పాఠాలు బోధించే శైలి వేరుగా ఉంటుంది. కాని కౌసల్య టీచర్ టీచింగ్ స్టైలే వేరు, ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది, అందుకే పాఠశాలలోని విద్యార్థులంతా ఆమె క్లాస్ కోసం ఎదురు చూస్తూ ఉంటారు..

తరగతిగదిలో పాఠాలు, తరగతిగది దాటి ఆట – పాటలు విలువలతో నేర్పించడం ఈ టీచర్ స్పెషాలిటీ. విద్యార్థులకు విలువలు నేర్పితే విజ్ఞానంతో కూడిన విద్య అదే వస్తుంది అని బలంగా నమ్ముతారు కౌసల్య టీచర్. పాఠశాలలో ప్రత్యక్షంగా ఆన్లైన్ లో పరోక్షంగా ఎప్పటికప్పుడు యాక్టివ్ గా ఉంటారు. తను పనిచేస్తున్న పాఠశాలలోని విద్యార్థులకు బోధిస్తున్న పాఠాలను, విలువలు, సామెతలను సోషల్ మీడియా వేదిక అయిన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేస్తున్నారు. దాదాపు 700 వీడియోలకి పైగా ఎడ్యుకేషనల్ కంటెంట్ , 700 వీడియోలకి పైగా సామెతలు, సూక్తులు పోస్ట్ చేశారు. Kousalya.kanha అనే పేరుతో నిర్వహిస్తున్న ఇన్స్టాగ్రామ్ పేజ్ లో 55 వేలకు పైగా ఫాలోవర్లు, 60 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. వీటితో పాటు, “English made easy,” ‘Lets learn with techniques” అనే వినూత్నమైన టెక్నిక్ లతో ఇంగ్లీష్, మ్యాథ్స్ ఈజీ మెథడ్ లో నేర్పించి, తన పాఠశాల విద్యార్థులతో పాటు ఆన్లైన్ లో ఎంతో మంది విద్యార్థులకు, వీక్షకులకు ఆదర్శంగా





నిలుస్తున్నారు. బుకెరామిరెడ్డిపల్లి కౌసల్య ప్రస్తుతం అనంతపురం జిల్లా, గుమ్మఘట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని సెకండరీ గ్రేడ్ టీచర్ గా పనిచేస్తున్నారు.



## పునాది విద్యకు తేజ శ్రీకారం

పునాది అభ్యసనం బలంగా ఉంటేనే ఏ విద్యార్థి అయినా చదువులో రాణించగలుగుతారని అడబాల హర్షిత తేజశ్రీ నమ్ముతున్నారు. ఆ దిశగా తను పనిచేస్తున్న పాఠశాలలో ఒకటి, రెండు, మూడు తరగతుల పిల్లలకు నేర్పిస్తున్నారు కూడా. స్కూల్ కి వచ్చామా రెండు పాఠాలు చెప్పామా అని కాకుండా, పిల్లలకు ఎంతవరకు నేర్పించాం? వాళ్లకి ఎంతవరకు అర్థమైందో, వారి ఆలోచనలు, వ్యక్తిత్వాలకు తగ్గట్టుగా నేర్పించడమే తేజశ్రీ టీచర్ స్పెషాలిటీ. అందుకోసం కొన్ని ట్రిక్స్, టెక్నిక్స్ కూడా ఉపయోగిస్తున్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లోని వినూత్నమైన బోధనా పద్ధతులను తమ పిల్లలకి ఆట,పాటల ఆధారంగా నేర్పిస్తున్నారు. సోషల్ మీడియాలో Teja_teacher



పేరు మీద ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటూ, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, పిల్లలతో చేయించిన యాక్టివిటీస్, తెలుగు పద్యాలను పోస్ట్ చేస్తున్నారు.. FLN ట్రైనింగ్స్ లో స్టేట్ రిసోర్స్ పర్సన్ గా అడబాల హర్షిత తేజశ్రీ ఉన్నారు. ఇటీవల నూతనంగా ఎంపికైన డీఎస్సీ టీచర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. హర్షిత తేజశ్రీ ప్రస్తుతం, కాకినాడ సంతానపురి మున్సిపల్ ప్రైమరీ స్కూల్ లో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పనిచేస్తున్నారు.

## విద్యార్థుల్లో కలిసిపోయి బోధించే టీచర్ అశ్విని



కొన్ని గ్రామాల్లో బడి ఈడు పిల్లలు ఉన్నా కూడా కొన్ని కారణాల వల్ల బడిలోకి జాయిన్ అవ్వలేరు, అందుకోసం గ్రామంలో సర్వే నిర్వహించి, పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని స్కూల్లో జాయిన్ చేశారు పెరమన అశ్విని టీచర్. పునాది అభ్యసనాలను, ఆటపాటల ద్వారా, క్రీడలతో నేర్పించేవారు.. గతంలో నెల్లూరు జిల్లాలోని కొండూరుపాళెంలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా చేరినప్పుడు 67గా ఉన్న విద్యార్థుల సంఖ్యను ఆ విద్యా సంవత్సరంలో 87 కి, ఆ తరువాత సంవత్సరంలో 97 కి పెంచడంలో కీలక పాత్ర పోషించారు అశ్విని టీచర్. తాను అనుసరించే బోధనా పద్ధతులను, రీల్స్ రూపంలో సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటున్నారు.

పెరమన అశ్విని ప్రస్తుతం తిరుపతి జిల్లా, కోట మండలం, కొక్కుపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ లోని సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాల రూపకల్పనలో కూడా భాగస్వామ్యం అయ్యారు.

– **అమలాపురపు దుర్గా ప్రసాద్,** జర్నలిస్ట్









# 21వ శతాబ్దపు నైపుణ్యాలు అవసరం నేను ఎందుకు భయపడుతున్నాను:

పది నుండి 24 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న వారు ప్రపంచంలో 1.8 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉన్నారు. మానవాళి చరిత్రలో ఉన్న పెద్ద సమూహాలలో ఇది ఒకటి. ఈ 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థలో ఉపాధి పొందడానికి లేదా వ్యాపారం చేయడానికి వారికి అవసరమైన నైపుణ్యాలు, అవగాహన కల్పించే విద్యావకాశాలు వారికి లభించవు. గత 30 సంవత్సరాలలో దేశాల మధ్య సాపేక్ష ఆదాయం, అసమానతలు తగ్గినవి. కానీ, సంపూర్ణ ఆదాయ అసమానతలు గణనీయంగా పెరిగినవి. ఉన్న అవకాశాలను తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలలోనివారు వారి వయసులోనే ఉన్న ధనికులతో సమానంగా అందుకోలేకపోతున్నారు. అంతేగాక, ఈ 30 సంవత్సరాలలో మరొక తరం వారు తాము పుట్టిన కుటుంబస్థాయిని బట్టి పేదరికపు ఊబిలోకి నెట్టివేయబడ్డారు.

**నేనెందుకు ఆశావహంగా ఉన్నాను:**

ఉత్పాదక రంగాల పనిలో యువత నిమగ్నమై ఉండే విధంగా వారిని తయారు చేయడానికి తన ప్రపంచ భాగస్వాములతో కలిసి యునిసెఫ్ ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. జెనరేషన్ అన్లిమిటెడ్ (Generation Unlimited) ప్రతి పిల్లవాడు స్కూల్ కి వెళ్లేటట్లుగా చూస్తున్నది. 2030 కల్లా వారంతా విద్యనార్జించి, శిక్షణ పొంది, ఉద్యోగాలను అందిపుచ్చుకునేట్లు చేయడం యునిసెఫ్ ధ్యేయం. ఆ విధమైన ఒక కార్యక్రమం ద్వారా అర్జెంటీనాలోని గ్రామీణ ప్రాంత పిల్లలు... మాధ్యమిక ఉపాధ్యాయులతో ముఖాముఖిగా లేదా ఆన్లైన్ లో కలిసే అవకాశం ఏర్పాటు చేయబడింది. దక్షిణాఫ్రికాలోని టెక్నో గర్ల్ (TechnoGirl) అనే సంస్థ బలహీనవర్గాల యువతులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత (STEM) రంగాలలో ఉద్యోగం చేసే చోటనే ఆ ఉద్యోగానికి సంబంధించిన అవసరమైన శిక్షణ, నిర్వహణ సామర్థ్యాలను బోధిస్తున్నది. బంగ్లాదేశ్ లో వేల సంఖ్యలో యువత మొబైల్ ఫోన్ సర్వీసింగ్ లాంటి వృత్తులలో శిక్షణ పొందుతున్నారు. మా 'యూత్ చాలెంజ్' పథకం ద్వారా వారి సమాజంలోని సమస్యలు వారే పరిష్కరించుకునే విధంగా చురుకైన యువతీ యువకులను సమాయత్తం చేస్తున్నాము. The Generation Unlimited Youth Challenge... 16 దేశాల్లో 800 మంది ఆవిష్కర్తలతో కలిసి... SpeakOut అనే మొబైల్ యాప్ ను ఆవిష్కరించింది. దానిని ఉత్తర మాసిడోనియాలోని యువత రూపొందించింది. దాని ద్వారా తాము ఎవరో తెలియకుండా తమ తోటివారికి అవసరమైన సహాయం చేయవచ్చు. The Red Code యాప్ ద్వారా పాకిస్థాన్లో యువతుల నెలసరి సమయంలో పాటించవలసిన శుభ్రత గురించి, వారు ఏ విధమైన పనులు చేసి స్వయం ఉపాధి కల్పించుకోగలరో తెలుసుకోగలుగుతారు.

– **హేన్రియేట్ హెచ్. ఫోర్** యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

అనువాదం: **చింతకుంట్ల సంపత్ రెడ్డి**





ప్రత్యేక సందర్భం

# 150 ఏళ్ల వందేమాతరం

బ్రిటిష్ వారి పాలనలో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా కోట్లమంది భారతీయులలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన వందేమాతరం గేయానికి 150 ఏళ్ళు పూర్తి అయ్యాయి. బెంగాళీ కవి బంకిం చంద్ర ఛటర్జీ గారు 1875 నవంబర్ 7 న రాశారు . దీనిని తన నవల ఆనంద మఠంలో 1882 సంవత్సరంలో ప్రచురించారు. తొలిసారిగా వందేమాతరం గేయాన్ని 1896 కొలకత్తా కాంగ్రెస్ సమావేశంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారు. అయితే స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగ సభ జాతీయ గేయంగా 1950 జనవరి 24 న ఆమోదించింది. వందేమాతరం గేయం 150 ఏళ్ళు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

1. 'వందేమాతరం' గేయ రచయిత ఎవరు ?

**జ : బంకిం చంద్ర ఛటర్జీ**

2. వందేమాతరం గేయాన్ని తొలుత ఏ భాషలో రాశారు?

**జ : సంస్కృతం**

3. వందేమాతరం ఏ నవలలో రాశారు?

**జ : ఆనంద మఠం**

4. వందేమాతరంను సంస్కృతం నుంచి ఏ భాష లోనికి అనువదించారు ?

**జ : బెంగాళీ భాష**

5. వందేమాతరం గేయాన్ని ఏ సంవత్సరం లో రాశారు?

**జ : 1875 నవంబర్ 7**

6. వందేమాతరం గేయ రచయత బంకిం చంద్ర ఛటర్జీ ఎప్పుడు జన్మించారు ?

**జ : జూన్ 27, 1838**

## పూర్తి వందేమాతరం గేయం మీకు తెలుసా?

వందేమాతరం వందేమాతరం

సుజలాం సుఫలాం మలయజ శీతలామ్
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం
శుభ్రజ్యోత్స్న పులకిత యామినీమ్
పుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్
సుహాసినీం సుమధుర భాషిణీమ్
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం

**చరణం 1:**
కోటి కోటి కంఠ కలకల నినాద కరాలే
కోటి కోటి భుజైధృత ఖర కరవాలే
అబలాకేనో మా ఏతో బలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదల వారిణీం మాతరం వందేమాతరం

**చరణం 2:**
తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వంహి ప్రాణాః శరీరే
బహుతే తుమి మా శక్తి
హృదయే తుమి మా భక్తి
తో మారయి ప్రతిమాగడి మందిరే మందిరే ||వందే||

**చరణం 3:**
త్వంహి దుర్గా దశ ప్రహరణధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణి విద్యాదాయినీ, నమామిత్వాం,
నమామి కమలాం
అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం, మాతరం

శ్యామలాం, సరలాం, సుస్మితాం, భూషితాం
ధరణీం, భరణీం, మాతరం వందేమాతరం



ఈ గీతం భారతదేశాన్ని ఒక తల్లిగా (మాతరం) భావించి, ఆమెకు వందనం సమర్పిస్తుంది. వందేమాతరం కేవలం పాట మాత్రమే కాదు, దేశభక్తికి, భారతదేశ సంస్కృతికి ప్రతీక. బంకించంద్ర ఛటర్జీ గారు రచించిన ఈ గీతం భారతదేశం యొక్క సహజ సౌందర్యాన్ని, శక్తిని, భక్తిని కీర్తిస్తుంది.

### ఈ గీతం భావం తెలుసుకుందామా!

ఓ తల్లీ నమస్కారం.
మంచి నీరు కల, మంచి ఫలములు (పంటలు) తల్లి,
మలయ పర్వతాల నుండి వీచే చల్లని గాలులు గల (తల్లి).
పచ్చని పంటలతో శోభిల్లే తల్లికి వందనం.

స్వచ్ఛమైన వెన్నెలలో పులకించిన రాత్రులు గల, వికసించిన పుష్పాలతో, చెట్ల ఆకులతో అందంగా ఉన్న, చిరునవ్వుతో ఉన్న, మధురంగా మాట్లాడే, సుఖాన్ని ఇచ్చే, వరాలను ప్రసాదించే తల్లికి వందనం.

**చరణం1:** కోట్ల కోట్ల గొంతుకల ధ్వనితో నిండిన, భయంకరమైన శక్తి గల, కోట్ల కోట్ల చేతుల్లో పదునైన ఆయుధాలు ధరించిన, ఓ అబల (బలహీనురాలు) అనుకున్న తల్లీ, నీవు ఇంతటి బలాన్ని ఎలా పొందగలిగావు?, ఎంతో బలాన్ని ధరించిన, (కష్టాల నుండి) రక్షించే (తరింపజేసే) తల్లికి నమస్కారం. శత్రు సమూహాలను నివారించే (తరిమివేసే) తల్లికి వందనం.

**చరణం2:** నీవే విద్యవు, నీవే ధర్మం. నీవే హృదయం, నీవే రహస్యం. నీవే మా శరీరంలోని ప్రాణం. మా చేతులలో నీవే శక్తి. మా హృదయంలో నీవే భక్తి. గుడి గుడిలో నీ బొమ్మ (ప్రతిమ) నిర్మించబడింది.

**చరణం3:** పది ఆయుధాలు ధరించిన దుర్గవు నీవే. కమల దళాలలో విహరించే లక్ష్మి (కమల) నీవే. విద్యను ప్రసాదించే సరస్వతి (వాణి) నీవే, నీకు నమస్కరిస్తున్నాను. లక్ష్మి అయిన, స్వచ్ఛమైన (అమలం), సాటిలేని (అతులం) నీకు నమస్కరిస్తున్నాను. మంచి నీరు, మంచి ఫలములు కల తల్లికి వందనం.

**చరణం 4:** నల్లని వర్ణం కల (పచ్చని పంటలతో), నిష్కపటమైన, చిరునవ్వుతో అలంకరించబడిన (తల్లి).

భారాన్ని మోసే, పోషించే తల్లికి వందనం.

సమాచార సేకరణ: **పాలధార వెంకటరమణ,**
TGT, APTWRS, సీతంపేట, 9542393923

# పాఠశాలల్లో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు – 2025

## “ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం ఆరోగ్యకరమైన మనసులు”





సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కెరీర్ మరియు మానసిక ఆరోగ్యం విభాగం (కెరీర్ అండ్ మెంటల్ హెల్త్) ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు – 2025 అక్టోబర్ 6 నుండి 10 వరకు విజయవంతంగా నిర్వహించారు.


విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు గురించి అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడం, మానసిక ఆరోగ్య సమస్యలపై ఉన్న అపోహలను తొలగించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ స్థాయిలో మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

**కార్యక్రమాలు:** ఐదు రోజుల పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, యోగా, ఒత్తిడి నిర్వహణ, వీధి నాటకాలు, ప్రదర్శనలు, షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శన, మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, జిల్లా వారీగా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.






# బొమ్మ గీశానోచ్!




**వై. శరణ్య,** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చీడిపూడి, సారవకోట, శ్రీకాకుళం జిల్లా




**కొల్లు మేఘన,** 5వ తరగతి , మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, గుమ్మడివారిపాలెం అయినవిల్లి మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




**షేక్ జాస్మిన్,** 7వ తరగతి, NCRNMH స్కూల్, మారిస్ పేట, తెనాలి




**కె. కిరణ్ కుమార్,** 10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మురది, డి హిరేహాల్, అనంతపురం




**సీ. హెచ్. నిత్యశ్రీ,** 6వ తరగతి, పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, నెల్లూరు

## చుక్కలు కలపండి



## రంగులు వేయండి



(చిట్టి కథ)

## మంచి నక్క



అడవిలో ఒక జిత్తులమారి నక్క ఉండేది. అది ఒక ఎముక దాని నోట్లో ఇరుక్కు పోయింది. ఎంత కష్టపడినా ఆ ఎముక బయటకు రాకపోవడంలో బాగా ఆలోచించి, కొంగ వద్దకు వెళ్లింది.

"కొంగమావ కొంగమావ నా నోటిలో ఒక ఎముక ఇరుక్కు పోయింది. అది తీసిపెడితే నీకు మంచి బహుమతి ఇస్తానని" నక్క ఆశ చూపించింది.

కొంగ "సరే" అని దాని నోటిలో తలపెట్టి ఎముక బయటకు తీసింది. ఎముక బయటకొచ్చిన తర్వాత అక్కడి నుంచి నక్క వెళ్లిపోయింది.

కొంగ ఎదురెళ్లి.. 'అదేంటి మావ.. ఎముక తీస్తే బహుమతి ఇస్తానని చెప్పావుగా' అని ప్రశ్నించింది.

'నువ్వు నా నోట్లో తలపెట్టినా నిన్ను తినకుండా వదిలిపెట్టాను చూడు.. అదే నీకు నేను ఇచ్చిన బహుమతి" అని చెప్పింది నక్క.

– **కె. మోక్షిత,** ఆరో తరగతి, ఎ–సెక్షన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అలుగోలు, నెల్లిమర్ల, విజయనగరం (జిల్లా)

## బాలల దినోత్సవం సందర్భంగా రాసిన పద్యం

**కందం:**

అల్లరి జేయుచు ముద్దుగ
యెల్లరు బాల్యము గడుపును యెంతో హాయిన్
కల్లా కపటము దెలియని
పిల్లల చేష్టలు మనసుకు వేడుక నీయున్.

– **కోవెలకొండ సంతోష్ కుమార్ స్వామి,** తెలుగు(ఎస్.ఎ), జెడ్పీహెచ్ఎస్, ఎం.సింగుపురం, పాలకొండ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా,

## అందరు చదవాలి

చదువు వల్ల అజ్ఞానం తొలగునులే
చదువు వల్ల విజ్ఞానం పెరుగునులే
చదువు వల్ల వివేకం కలుగునులే
చదువు వల్ల ఆలోచన పెరుగునులే
చదువు వల్ల నీతి, నియమాలు తెలియునులే
చదువు వల్ల సమైక్యత పెరుగునులే
చదువు వల్ల జీవన మార్గం కలుగునులే
చదువంటే మదిలోని దేవుడులే
అందుకే అందరూ చదవాలి
దేశానికి ప్రగతి బాట వేయాలి.

– **ఎం.చరిత,** 10వ తరగతి, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల, వినుకొండ, పల్నాడు జిల్లా

# కొత్త సమాచారం తెలుసుకుందాం

## క్రీడలు

* భారత జట్టు 47 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి మహిళల క్రికెట్ వన్డే ప్రపంచకప్ నెగ్గింది. 2025, నవంబరు 2న ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో భారత్ 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. భారత జట్టుకు సార్థ్యం వహించిది హర్మన్ ప్రీత్ కౌర్. యువ ఓపెనర్ షెఫాలి వర్మ (87; 78 బంతుల్లో 7x4, 2x6) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా దీప్తి శర్మ (215 పరుగులు, 22 వికెట్లు) ఉంది. విజేత జట్టుకు రూ.37.3 కోట్లు, రన్నరప్కు రూ.20 కోట్లు ప్రైజ్ మనీగా లభించాయి.




మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన నాలుగో జట్టు భారత్. ఆస్ట్రేలియా (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022) గెలవగా.. ఇంగ్లాండ్ నాలుగుసార్లు (1973, 1993, 2009, 2017) ఛాంపియన్ షిప్ సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ (2000) ఒకసారి గెలిచింది.

* భారత్ లో జరుగుతున్న చెస్ ప్రపంచకప్ కు విశ్వనాథన్ ఆనంద్ ట్రోఫీ అని నామకరణం చేశారు. అక్టోబరు 31న ఈ టోర్నీ ఆరంభోత్సవంలో కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఈ కప్ ను ఆవిష్కరించారు. “చెస్ ప్రపంచకప్ కు దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ పేరు పెడుతున్నందుకు ఎంతో గర్విస్తున్నాం” అని అఖిల భారత చెస్ సమాఖ్య వెల్లడించింది. ఆనంద్ అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ గా నిలిచాడు.

* ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీలు 2025, అక్టోబరు 5న ముగిశాయి.




భారత్ 22 పతకాలతో (6 స్వర్ణాలు, 9 రజతాలు, 7 కాంస్యాలు) పదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో బ్రెజిల్ 44 పతకాలతో (15 స్వర్ణాలు, 20 రజతాలు, 9 కాంస్యాలు) అగ్రస్థానంలో నిలిచింది. చైనా 52 (13 స్వర్ణాలు, 22 రజతాలు, 17 కాంస్యాలు), ఇరాన్ 16 (9 స్వర్ణాలు, 2 రజతాలు, 5 కాంస్యాలు) తర్వాతి రెండు స్థానాలు దక్కించుకున్నాయి.

## సైన్స్ & టెక్నాలజీ

* భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. బాహుబలి రాకెట్ గా పేరొందిన 'ఎల్వీఎం3-ఎం5' వాహకనౌక ద్వారా ఇది నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) లోని రెండో ప్రయోగ వేదిక నుంచి 2025, నవంబరు 2న ప్రయోగం జరిగింది. ఈ శాటిలైట్ 15 ఏళ్ల పాటు కమ్యూనికేషన్ సేవలు అందించనుందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడించారు.

* సీఎంఎస్-03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడడంతోపాటు సముద్ర వాతావరణ పరిస్థితులు తెలుసుకొనే వెసులుబాటు కలగనుంది. ప్రధానంగా భారత నౌకాదళ అవసరాల కోసం



దీన్ని రూపొందించారు. భారత భూభాగం నుంచి ఇస్రో ప్రయోగించిన అతి పెద్ద కమ్యూనికేషన్ ఉపగ్రహం ఇదే.

* ప్రపంచంలోనే తొలిసారిగా అణుశక్తితో నడిచే క్రూజ్ క్షిపణి 'బురెవెస్ట్నిక్'ని రష్యా సిద్ధం చేసింది. గాల్లో 'అపరిమిత సమయం' పాటు ఇది సంచరించగలదు. రష్యా సైన్యం ఇటీవల 'అణు' విన్యాసాలు నిర్వహించింది.



పరీక్షల సమయంలో 'బురెవెస్ట్నిక్' 15 గంటల పాటు గాల్లోనే ఉందని, 14వేల కిలోమీటర్లు ప్రయాణించిందని రష్యా తెలిపింది. ఇటీవలి పరీక్షలో ఈ అస్త్రం.. 50 నుంచి 100 మీటర్ల ఎత్తులో విహరించింది.

## నియామకాలు



* సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. దీంతో 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ అయ్యింది. నవంబరు 24న సీజేఐగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. 2027 ఫిబ్రవరి 9వరకు సీజేఐ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించబోతున్నారు.

* ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ప్రమాణం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాలులో అక్టోబరు 27న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకుర్ ఆయనతో ప్రమాణం చేయించారు.



* రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా సోనాలీ సేన్ గుప్తా నియమితులయ్యారు. ఈమె నియామకం అక్టోబరు 9 నుంచే అమల్లోకి వచ్చిందని కేంద్ర బ్యాంక్ తెలిపింది. ఇంతవరకు ఆర్బీఐ బెంగళూరు కార్యాలయంలో, కర్ణాటక రీజనల్ డైరెక్టర్గా ఆమె వ్యవహరించారు.



* తూర్పు నావికాదళ చీఫ్ (ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్)గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా 2025 అక్టోబరు 31న నియమితులయ్యారు. కమాండ్ ముఖ్య కార్యాలయం ఐఎన్ఎస్ సర్కార్స్లో బాధ్యతలు స్వీకరించారు.



* లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన సనాయె తకాయిచి (64) జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. తకాయిచి జపాన్ రాజకీయాల్లో ఉక్కు మహిళగా పేరు పొందారు. షిగెరు ఇషిబా ఇటీవల తన ప్రధాని పదవికి రాజీనామా చేయగా, ఆయన స్థానంలో తకాయిచి ఆ పదవి చేపట్టారు.

# ప్రభుత్వ బడి పిల్లలమండీ...
# విమానమెక్కి వచ్చామండీ

న్యూఢిల్లీలో నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం, రష్యా సైన్స్ అండ్ కల్చరల్ సెంటర్ సందర్శనకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు. రెండు రోజుల ఈ టూర్ ద్వారా ప్రాక్టికల్‌గా విద్యార్థుల్లో సైన్స్ & టెక్నాలజీపై అవగాహన పెరగడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ తీసుకుంది.













# కళా ఉత్సవ్.. భళా

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అక్టోబరు 23,24 తేదీల్లో విజయవాడలోని మురళి రిసార్ట్స్ వేదికగా 'కళా ఉత్సవ్' ఘనంగా జరిగింది. 12 కళా ప్రక్రియల్లో 3,365 మంది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. పాఠశాల విద్యాశాఖ కమీషనర్ విజయ్ రామరాజు. వి IAS., గారు ప్రారంభోత్సవం చేయగా, ముగింపు సభలో సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS., గారు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. 12 కళల్లో ప్రథమ స్థానం పొందిన విజేతలు డిసెంబరులో పూణెలో జరిగే జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొంటారు.













Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur